సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 22 । మార్చి । 2024



టన్ను చీనీ రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22 వేలు పలికాయి. మార్కెట్‌కు 249 టన్నుల సరుకు వచ్చింది.



కిలో టమాట రూ.12

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.12, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

శుక్రవారం సాయంత్రం ఇఫ్తార్ : 6.34

శనివారం ఉదయం సెహరీ : 5.08



న్యూస్‌రీల్

భక్తులకు ఇబ్బంది కలగొద్దు

- పోలీసు సిబ్బందిని ఆదేశించిన ఎస్పీ



ఎస్పీకి శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈఓ, అర్చకులు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణపై కదిరి డివిజన్ పోలీస్ అధికారులతో గురువారం ఎస్పీ మాధవ్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. 15 రోజులు పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సులభంగా స్వామి వారిని దర్శించుకునే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. రథోత్సవానికి అన్ని ఏర్పాటు సిద్ధం చేసుకోవాలని, పోలీసులు భక్తి భావంతో విధులు నిర్వహించాలన్నారు. భక్తులతో మర్యాద పూర్వకంగా మెలగాలని సూచించారు. ముఖ్యంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. రథోత్సవానికి కర్ణాటక, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు చేయాలన్నారు. తొక్కిసలాట జరగకుండా చర్యలు చేపట్టాలని, నిర్దేశిత పార్కింగ్ ఏరియాలో మాత్రమే వాహనాలు పార్కింగ్ చేసేలా చూడాలన్నారు. అనంతరం ఖాద్రీశుడిని ఎస్పీ దంపతులు దర్శించుకున్నారు. స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదాన్ని ఆలయ ఈఓ వీ.శ్రీనివాసరెడ్డి, అర్చకులు అందజేశారు. కార్యక్రమంలో కదిరి డీఎస్పీ శ్రీలత, సీఐలు పుల్లయ్య, వెంకటేశ్వర్లు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బీసీ సెల్‌లో ఇద్దరికి చోటు

సాక్షి, పుట్టపర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్‌లో జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు లభించింది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర బీసీ విభాగం కార్యదర్శులుగా జె.లక్ష్మీనరసింహగౌడ్, సంపంగి గోవర్ధన్ నియమితులయ్యారు. ఈమేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా కొత్తగా నియమితులైన వారు మాట్లాడుతూ.. తమ ఎంపికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. తమపై నమ్మకం ఉంచి ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్దేశించిన లక్ష్య సాధన కోసం పని చేస్తామని తెలిపారు.

పట్టు పెంపకంతో ఆర్థికాభివృద్ధి

- పట్టు పరిశ్రమశాఖ జాయింట్ డైరెక్టర్ పద్మమ్మ



చంద్రికల్లో తొలగిస్తున్న పట్టు గూళ్లను పరిశీలిస్తున్న జాయింట్ డైరెక్టర్ పద్మమ్మ

మడకశిరరూరల్: సాంకేతిక పద్ధతులు అవలంభించడం ద్వారా పట్టు రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని పట్టు పరిశ్రమశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ పద్మమ్మ తెలిపారు. గురువారం మధ్యాహ్నా ఆమె చాపార్లపల్లి, జిల్లెడుగుంట, భక్తరపల్లి గ్రామాల్లో పర్యటించారు. పట్టు రైతులు నూతనంగా నిర్మిస్తున్న మల్బరీ షెడ్లు, మల్బరీ తోటలు, పట్టు గూళ్ల తొలగింపు తదితర వాటిని పరిశీలించారు. రైతులతో పట్టు పెంపకం, షెడ్లు నిర్మాణం, పట్టు పెంపకంలో సాంకేతిక పద్ధతులు, మెళకువలు తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ పద్మమ్మ మాట్లాడుతూ ఎండ తీవ్రత అధికంగా ఉందని, పట్టు పురుగులు పెంపకం చేపట్టిన రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మల్బరీ షెడ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలన్నారు. పట్టు పరిశ్రమశాఖ ద్వారా అందించే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. నీటి సౌకర్యం ఉన్న రైతులు మల్బరీ తోటలు సాగు చేయాలని దీనికి పట్టు పరిశ్రమశాఖ పూర్తిగా సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక పట్టు పరిశ్రమశాఖ ఏడీ రాజు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హంస వాహనంపై వీణాపాణి



హంస వాహనంపై దర్శనమిస్తున్న శ్రీవారు



తిరువీధుల్లో స్వామి దర్శనం కోసం వేచివున్న భక్తులు



తిరువీధుల్లో హంస వాహనంపై విహరిస్తున్న ఖాద్రీశుడు

కదిరి: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గురువారం స్వామివారు వీణాపాణిగా హంస వాహనంపై చదువుల తల్లి సరస్వతీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మ వాహనమైన హంస పరమ హంసకు ప్రతీక. హంసకు ఒక ప్రత్యేకత ఉంది. అది పాలను, నీళ్లను వేరు చేయగలదు. అంటే మంచి, చెడును గ్రహించ గలిగిన అపురూపమైన శక్తి దాని సొంతం. అందుకే ఉపనిషత్తులు పరమేశ్వరునిగా అభివర్ణిస్తున్నాయి. నారసింహుడు హంస వాహనాన్ని అధిరోహించి తిరువీధుల్లో దర్శనమివ్వడం భక్తులలో అహంభావాన్ని తొలగించి శరణాగతిని కల్గిస్తాడని అర్చక పండితులు తెలిపారు. చేతిలో వీణ, విశేష దివ్యాభరణాలు, పట్టు పీతాంబరాలు ధరించిన స్వామివారు తిరువీధుల్లో ఊరేగుతుంటే శ్రీవారి కరుణాకటాక్షం కోసం భక్తులు తిరువీధుల్లో ఎదురు చూశారు. ఉభయ దారులుగా పట్టణానికి చెందిన తోటంశెట్టి రాజుగోపాల్‌శెట్టి కుటుంబీకులు వ్యవహరించారని ఆలయ ఈఓ వెండిదండి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

నేడు సింహ వాహనంపై దర్శనం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఖాద్రీశుడు మాడవీధుల్లో సింహ వాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. మనుషులలో జంతు స్వాభావికమైన ప్రవృత్తిని అదుపు చేసుకోవాలని లోకానికి చాటిచెప్పడానికే శ్రీవారు సింహవాహనంపై ఊరేగుతారని భక్తుల నమ్మకం.

అభివృద్ధికి బాటలు





గోరంట్ల మండలం కరావులపల్లి నుంచి కొత్తచెరువు మండలం బండ్లపల్లి వరకూ వేసిన రోడ్డు, కొట్లపల్లిలో వంక మీదుగా యర్రబల్లి వరకూ వేసిన సిమెంటు రోడ్డు

గతంలో గ్రామీణ రహదారులు గుంతలు మయంగా ఉండేవి. కొన్ని గ్రామాలకు అసలు 108, 104 లాంటి వాహనాలు సైతం వెళ్లడానికి ఇబ్బందిగా ఉండేవి. రహదారుల చుట్టూ పెరిగిన కంపతో ఎదురుగా వెళ్లే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు జరిగే పరిస్థితి. అయితే నేడు గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో పల్లెలు అభివృద్ధి 'బాట' పట్టాయి. అవసరమైన చోట సీసీ రోడ్లు, మరికొన్ని చోట్ల తారురోడ్లు వేయడంతో గ్రామాల స్వరూపమే మారిపోయింది.

- గతంలో అధ్వానంగా గ్రామీణ రహదారులు
- కొన్ని ప్రాంతాల్లో నడిచి వెళ్లేందుకు కూడా సాధ్యంకాని వైనం
- పల్లెలపై ప్రత్యేక దృష్టిసారించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- జిల్లాలో రూ.52.55 కోట్లతో 131 కిలోమీటర్ల రోడ్డు ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామీణులు

పుట్టపర్తి అర్బన్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. ఇందులో భాగంగానే ఐదేళ్లలో జిల్లాలోని మారుమూల గ్రామాలకు సైతం రోడ్లు ఏర్పాటు చేసింది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు ప్రశాంత జీవనం సాగిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఉపాధి హామీ పథకం, తదితర వాటితో పాటు ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) పథకం కింద పలు రోడ్లు నిర్మించింది. దీంతో ఆయా గ్రామాలకు ప్రధాన రోడ్లు, మండల కేంద్రాలతో కనెక్టివిటీ పెరిగింది.

రోడ్లకు నూతన శోభ..

కొన్ని గ్రామాలకు బ్రిటీష్ కాలంలో ఉన్న కనెక్టివిటీ రోడ్లు దాదాపు మూసుకు పోయాయి. వాటిని గుర్తించి తారు రోడ్లు, సిమెంటు రోడ్లు ఏర్పాటు చేయడంతో తక్కువ దూరంతోనే ప్రధాన రోడ్లపైకి వెళ్లి పట్టణాలకు చేరుకుంటున్నారు. జిల్లాలో కదిరి, పుట్టపర్తి, మడకశిర, పెనుకొండ, హిందూపురం, ధర్మవరం నియోజక వర్గాల్లోని మారుమూల ప్రాంతాలకు చెందిన రోడ్లు నూతన శోభను సంతరించుకున్నాయి.

రూ.52.55 కోట్లతో రోడ్ల నిర్మాణం..

జిల్లాలోని ఆరు నియోజక వర్గాల్లోని పలు మారుమూల ప్రాంతాలకు రోడ్లు నిర్మించడంతో ప్రజలతో పాటు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆయా రహదారులు చాలా వరకూ ఆక్రమణలకు గురై దాదాపు మూసుకుపోయి ఉండేవి. ప్రభుత్వం వాటిని సర్వే చేయించి హద్దులు గుర్తించి రోడ్లు నిర్మించింది. దీని కోసం రూ.52.55 కోట్లతో 14 రోడ్లను 131.18 కిలో మీటర్లు నిర్మించి అందుబాటులోకి తెచ్చింది. మరి కొన్ని రోడ్లకు అనుమతులు మంజూరు చేసి టెండర్ పనులు పూర్తి చేయడంతో త్వరలోనే పనులు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.

పుట్టపర్తి నియోజకవర్గంలో అధికం..

కదిరి నియోజకవర్గంలో రూ.6.54 కోట్లతో 24.60 కిలోమీటర్ల రోడ్లు వేశారు. హిందూపురం నియోజకవర్గంలో రూ.3.14 కోట్లతో 4.30 కిలోమీటర్లు, పుట్టపర్తి నియోజకవర్గంలో రూ.32.70 కోట్లతో 14.12 కిలో మీటర్లు, ధర్మవరం నియోజకవర్గంలో రూ.10.19 కోట్లతో 30.74 కిలోమీటర్ల రోడ్లను పూర్తి చేశారు. అలాగే మడకశిర నియోజకవర్గంలో రూ.3.30 కోట్లతో 11.60 కిలోమీటర్లు, పెనుకొండ నియోజకవర్గంలో రూ.14.10 కోట్లతో 28.40 కిలో మీటర్ల రోడ్డు నిర్మించారు. మొత్తం రూ.52.55 కోట్లతో 131.18 కిలోమీటర్ల రోడ్లు నిర్మించారు. దీంతో పాటు కొన్ని రోడ్లకు అనుమతులు మంజూరు కావడంతో టెండర్లు కూడా పూర్తయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభిస్తారని డీఈ మధుభూషణ్‌రెడ్డి తెలిపారు. ఇందులో కోడూరు-బండ్లపల్లి మార్గంలోని పెద్ద వంక రోడ్డు, పాలసముద్రం- ఈ గంగంపల్లి మధ్యలో బ్రిడ్జి, మడకశిర మండలం పెనుకొండ రోడ్డు - హరేసముద్రం రోడ్డు వేసేందుకు రూ.18.54 కోట్లు ఇప్పటికే మంజూరయ్యాయి. త్వరలోనే నిర్మాణ పనులు మొదలు కానున్నాయి.

భూముల ధరలకు రెక్కలు..

బ్రిటీష్ కాలంలో కొన్ని రోడ్లు వినియోగంలో ఉన్నా కాలానుగుణంగా వాటిని వినియోగించకపోవడంతో దాదాపు మూతబడ్డాయి. దీంతో వేలాది ఎకరాల భూములు ఉన్నా వాటి ధరలు తక్కువగానే ఉండేవి. ప్రభుత్వం వాటిని సర్వే చేయించి వినియోగంలోకి తీసుకురావడంతో పాటు తారు, సిమెంటు రోడ్లు ఏర్పాటు చేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేసింది. రోడ్లు పూర్తి కావడం గతంలో ఎకరా భూమి రూ. 2 లక్ష నుంచి రూ.3 లక్షలు పలికినవి నేడు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షలకు చేరుకున్నాయి. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దూరం తగ్గింది



మా గ్రామం నుంచి ఇటు పెడపల్లి అటు కొట్లపల్లి నుంచి కరావులపల్లి వరకూ రోడ్డు ఏర్పాటు చేయడంతో చాలా సంతోషంగా ఉంది. ఎప్పుడో బ్రిటీష్ కాలంలో వేసిన రోడ్లపైనే ఇన్నాళ్లూ రాకపోకలు సాగించాము. గత ఏడాది తారు, సిమెంటుతో రోడ్లను పటిష్టంగా వేశారు. ప్రస్తుతం ఎక్కడైనా సులువుగా చేరుకోగలుగుతున్నాము. గతంలో పైపల్లి నుంచి కొట్లపల్లికి వెళ్లాలంటే 6 గ్రామాలు మీదుగా 12 కిలోమీటర్ల దూరం ఉండేది. నేడు కేవలం 3 కిలోమీటర్ల దూరంలోనే పొలాల దారి గుండా కొట్లపల్లిని చేరుకోగలుగుతున్నాము.

– మాధవప్ప, పైపల్లి

భూముల ధరలు పెరిగాయి



గోరంట్ల మండలం కరావులపల్లి నుంచి మా గ్రామం మీదుగా కొత్తచెరువు మండలం బైరాపురం, బండ్లపల్లికి, ఇటు వైపున పుట్టపర్తి మండలం పెడపల్లి, బత్తలపల్లికి పీఎంజీఎస్‌వై కింద రోడ్డు వేయడంతో సమీప భూములకు రెక్కలు వచ్చాయి. ఆయా రోడ్ల వెంబడి ఎకరా భూమి గతంలో కేవలం రూ.3 లక్షలు ఉండేది. ప్రస్తుతం రూ.10 లక్షల వరకూ పలుకుతున్నాయి. వాహన రాకపోకలు పెరగడంతో వ్యవసాయం చేయడం సులభ తరమవుతోంది. కొందరు రైతులు బోర్లు వేసుకొని వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు.

– కుళ్లాయిరెడ్డి, కొట్లపల్లి

రవాణా సులువుగా మారింది



జిల్లాలో పీఎంజీఎస్‌వై నిధులతో సుమారు 131 కిలోమీటర్ల రోడ్లను రూ.52 కోట్లతో నిర్మించాము. నూతనంగా మరి కొన్ని రోడ్లు మంజూరయ్యాయి. ఎన్నికలు ముగిశాక పూర్తి చేస్తాము. రోడ్డు సౌకర్యం పెరగడంతో గ్రామాల మధ్య సత్సంబంధాలు పెరిగాయి. భూముల ధరలు పెరుగుతున్నాయి. అత్యవసర వేళ పట్టణాలకు చేరడానికి రవాణా సులువుగా మారింది.

– మధుప్రకాష్‌రెడ్డి, డీఈ, పీఏయు

పోలింగ్ కేంద్రాల తనిఖీ



గాడ్రాళ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జేసీ

చిలమత్తూరు: మండలంలోని గాడ్రాళ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సుబ్బరావుపేట పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తనిఖీ చేశారు. ఆయన గురువారం పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలను పరిశీలించారు. సుబ్బరావుపేటలో మొదటిసారి పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జేసీ పేర్కొన్నారు. మద్యం, నగదు అక్రమ రవాణా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

లేపాక్షి: మండల పరిధిలోని చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని జేసీ అభిషేక్‌కుమార్ గురువారం పరిశీలించారు. ర్యాంప్‌లు, లైటింగ్, తాగునీరు, మరుగుదొడ్ల మరమ్మతును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

'పురం' మార్కెట్‌కు 57 టన్నుల చింతపండు



మార్కెట్‌కు వచ్చిన చింతపండు

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ చింతపండు కొనుగోళ్లతో కళకళలాడుతోంది. గురువారం ఈ సీజన్‌లోనే అత్యధికంగా 57.70 టన్నుల (57 లారీలు) చింతపండు రాగా, ఈ-నామ్ పద్ధతిలో వేలం వేసినట్లు కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. అందులో కరిపులి రకం క్వింటా గరిష్టంగా రూ.24 వేలు, కనిష్టంగా రూ.8 వేలు, సగటున రూ.13 వేల ప్రకారం పలికిందన్నారు. అలాగే ఫ్లవర్ రకం క్వింటా గరిష్టంగా రూ.11 వేలు, కనిష్టంగా రూ.4 వేలు, సగటున రూ.6 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగినట్లు మార్కెట్ కార్యదర్శి వెల్లడించారు.

సరిహద్దులపై ప్రత్యేక నిఘా

- ఎన్నికల వేళ అంతర్రాష్ట్ర జిల్లా చెక్ పోస్టుల ఏర్పాటు
- డబ్బు, మద్యం అక్రమ తరలింపునకు అడ్డుకట్ట
- 24 గంటల పాటు తనిఖీలు
- ఇప్పటికే జిల్లాకు చేరిన కేంద్ర బలగాలు



సీజ్ చేసిన క్రికెట్ బ్యాట్లను చూపుతున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికలు శాంతియుత వాతవరణంలో ఎన్నికల్లో నిర్వహించేందుకు ఎస్పీ మాధవరెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ యంత్రాంగం పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా అరు నియోజకవర్గాల్లో 1571 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 258 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

చెక్ పోస్టుల్లో ప్రత్యేక నిఘా..

సార్వత్రిక ఎన్నికలు జరుగతున్న నేపథ్యంలో ఎట్టి పరిస్థితిల్లో నగదు, మద్యం సరిహద్దుల నుంచి జిల్లాకు చేరకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. పోలీస్‌శాఖతో పాటు రెవెన్యూ, ఇతర సిబ్బందితో బృందాలు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. డబ్బు, మద్యం, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంపై పోలీసులు దృష్టి సారించారు.

జిల్లాకు చేరిన కేంద్ర బలగాలు..

ఇప్పటికే కేంద్ర బలగాలు జిల్లాకు చేరాయి. త్వరలో ఇంకా కొన్ని కేంద్రబలగాలు జిల్లా చెక్ పోస్టులకు చేరనున్నాయి. ఇప్పటికే రసీదులు లేని నగదును పోలీసులు స్వాధీనం చేసుకుంటున్నారు. డబ్బు నిల్వలు, ఎన్నికల కోడ్‌లపై దృష్టి సారించారు. జిల్లా వ్యాప్తంగా ప్రధాన కేంద్రాల్లో కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ (కవాతు) నిర్వహిస్తూ ఓటర్లకు భరోసా కల్పిస్తున్నారు. నేరచరితులను బైండోవర్ చేస్తున్నారు. లైసెన్స్ ఆయుధాలు డిపాజిట్ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. కార్డెన్ సెర్చ్, ఆపరేషన్లు, పికెటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా స్పెషల్ బ్రాంచి, లా అండ్ ఆర్డర్, సెబ్ ఏఆర్, సైబర్, ఐటీ కోర్, తదిత విభాగాల అధికారుల సమన్వయంతో పక్కాగా విధులు నిర్వహిస్తున్నారు.

రూ.50 వేలు మించితే ఆధారాలు తప్పనిసరి..

రూ 50 వేలకు మించి నగదు తరలించే క్రమంలో తనిఖీల్లో అధికారులకు పట్టుబడితే ఈసీ నిబంధనల ప్రకారం ఆ నగదుకు సంబంధించిన ఆధారాలు కచ్చితంగా చూపాలి. లేకపోతే ఆ నగదు సీజ్ చేసి ఐటీ అధికారులకు అప్పగిస్తారు. నగదుతో పాటు బంగారం, వెండి వంటి ఆభరణాలు కొనుగోలు చేసినా, తాకట్టు పెట్టినా, విడిపించినా సంబంధిత రసీదులు వెంట తీసుకెళ్లాలి. ఎవరైనా ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే అందుకు అవసరమైన నగదు తీసుకెళ్తున్నట్లయితే డాక్టర్లు ఇచ్చిన రసీదు చూపించాలి. సరైన ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదు, బంగారాన్ని తరలిస్తూ పట్టుబడితే ఐటీ, జీఎస్టీ, ఈడీ అధికారులకు సమాచారం అందించి కేసులు నమోదు చేస్తారు.

'కొడికొండ'లో వంద క్రికెట్ బ్యాట్ల సీజ్

హిందూపురం అర్బన్/చిలమత్తూరు: సార్వత్రిక ఎన్నికల వేళ రాష్ట్ర సరిహద్దులో ఏర్పాటు చేసిన కొడికొండ, తూమకుంట చెక్‌పోస్టుల్లో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగానే గురువారం కొడికొండ చెక్‌పోస్టును డీఎస్పీ కంజాక్షన్ తనిఖీ చేశారు. అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన స్వయంగా తనిఖీలో పాల్గొన్నారు. కొడికొండ చెక్‌పోస్టు మీదుగా ఓ కారులో వంద క్రికెట్ బ్యాట్‌లు తీసుకెళ్తుండగా వాటిని పోలీసులు సీజ్ చేశారు. ఎలాంటి బిల్లులు చూపకపోవడంతో సీజ్ చేసి స్థానిక పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ భాగ్యలత, ఫ్లెయింగ్ స్క్వాడ్ ప్రత్యేకాధికారి యూనిస్ తెలిపారు. అలాగే మరో కారులో 200 గోడ గడియారాలు తరలిస్తుండగా పట్టుకొన్నారు. పూర్తిస్థాయిలో విచారించిన తరువాత అవి దుకాణాల్లో అమ్మేందుకు తీసుకెళ్లుతున్నట్లు నిర్ధారణ కావడంతో వారికి వెనక్కు ఇచ్చేశామని డీఎస్పీ తెలిపారు. సరిహద్దు గ్రామాల మీదుగా వెళ్లే ప్రతి వాహనాన్ని తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు.

'పురం'లోనూ...

హిందూపురం పట్టణంలో సైతం ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది తనిఖీలు చేపడుతున్నారు. కాలనీల్లో, అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిపై నిఘా పెడుతున్నారు. పట్టణంలోని గ్యాస్ గోడౌన్ వద్ద గురువారం ఉదయం 9 కేసుల మద్యం, స్కూటీ వాహనాన్ని పోలీసులను చూసి దుండగులు వదిలి వెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని మద్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేశారు.

పారదర్శక ఎన్నికలే లక్ష్యం



జిల్లాలో పారదర్శక ఎన్నికలే లక్ష్యంగా పనిచేస్తున్నాం. అక్రమాలకు తావు లేకుండా జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. నగదు, బంగారం తరలించకుండా ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి తనిఖీలు ముమ్మరం చేశాం. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి. ప్రశాంత ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు.

– మాధవరెడ్డి, ఎస్పీ

ఒత్తిడి తగ్గాలి.. నైపుణ్యం పెరగాలి

- ఇంజినీరింగ్ కష్టం అనే అపోహ తొలగేలా ప్రత్యేక శిక్షణ
- తరగతులు ప్రారంభమయ్యే ముందే విద్యార్థులకు కౌన్సెలింగ్
- ఇంటర్ విద్యకు భిన్నంగా బీటెక్ నాలెడ్జ్‌పై పరిజ్ఞానం అవసరం
- ఏర్పాట్లు చేయాలని వర్సిటీలకు ఏఐసీటీఈ ఆదేశాలు



అనంతపురం: ఇంజినీరింగ్ తరగతులు ప్రారంభమయ్యే ముందే విద్యార్థులను మానసికంగా సంసిద్ధం చేయాలని వర్సిటీల యాజమాన్యాలను అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) ఆదేశించింది. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను జారీ చేసింది. మారిన బోధనా ప్రణాళికను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లుగా ఏఐసీటీఈ గత రెండేళ్లుగా చేపట్టిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. ఈ క్రమంలో ఐఐటీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలనూ కౌన్సిల్ పరిగణలోకి తీసుకుంది. అలాగే ప్రాక్టికల్ నాలెడ్జ్‌తో కూడిన విద్య అందుబాటులోకి తెచ్చేందుకు నూతన జాతీయ విద్యా విధానం జారీ చేసిన మార్గదర్శకాలతో ఇంజినీరింగ్ రెండో ఏడాది నుంచే పారిశ్రామిక సంస్థల భాగస్వామ్యంతో పాఠ్య ప్రణాళికలో మార్పు చేశారు. దీంతో ఇంజినీరింగ్ విద్యార్థులు ఒక్కసారి మూస విధానం నుంచి స్వతంత్రంగా ఆలోచించే విద్యా విధానంలో అడుగు పెట్టాల్సి వచ్చింది. ఇది కూడా మానసిక ఒత్తిడికి కారణమవుతోందని ఏఐసీటీఈ అధ్యయనంలో తేలింది. దీంతో ఇంజినీరింగ్ అంటేనే కష్టమనే అపోహ అందరిలోనూ నెలకొంది. ఈ అపోహయను తొలగించేలా తరగతులు ప్రారంభమయ్యే ముందే విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చేలా మార్గదర్శకాలను కౌన్సిల్ జారీ చేసింది.

బ్యాక్‌లాగ్స్ భారమై...

ఇంజినీరింగ్ విద్యార్థులు కేవలం 18 నుంచి 20 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులవుతున్నారు. సింహభాగం విద్యార్థులు మొదటి సంవత్సరంలోనే ఫెయిల్ అవుతున్నారు. ఇంటర్మీడియట్ విద్యా ప్రణాళిక, బీటెక్ విద్యా ప్రణాళిక విభిన్నంగా ఉండడమే ఇందుకు కారణం. ఇంటర్ వరకూ బట్టీ చదువులకు అలవాటు పడిన విద్యార్థులు... ఇంజినీరింగ్‌లో ప్రవేశించేటప్పటికి భిన్న విధానాలను అవలంభించాల్సి వస్తోంది. కంప్యూటర్ సైన్స్‌లో గణితం భాష ఒక్కసారిగా మారిపోతుంది. రెండో ఏడాదికి వచ్చే సరికి అనేక కంప్యూటర్ లాంగ్వేజ్‌లను విద్యార్థి నేర్చుకోవడమే కాకుండా, దాని ఆధారంగా ప్రయోగాత్మక ఫలితాలు సాధించాల్సి ఉంటుంది. సివిల్, మెకానికల్‌లోనూ ఆధునిక సాంకేతికతపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంటుంది. విద్యార్థి వ్యక్తిగతంగా నైపుణ్యాలు పెంచుకుంటే తప్ప ఈ పరిస్థితుల్లో ముందుకెళ్లడం కష్టం. ఈ కారణంగా బీటెక్ మొదటి, రెండో సంవత్సరాల్లో విద్యార్థులకు బ్యాక్‌లాగ్స్ ఎక్కువగా ఉంటున్నాయి. ఇదే విద్యార్థి మానసిక ఒత్తిడికి కారణమవుతోంది. విద్యార్థి మానసిక స్థితిని గుర్తించి నిపుణుల ద్వారా కౌన్సెలింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

అధునాతన కోర్సులకు అధ్యాపకుల కొరత:

విపరీతమైన క్రేజ్ నెలకొన్న కంప్యూటర్ సైన్సెస్, దాని అనుబంధ కోర్సులను ఇబ్బడిముబ్బడిగా ఆయా కళాశాలల్లో ప్రవేశపెట్టారు. గత మూడేళ్లలో డేటా సైన్సెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో అధునాతన కోర్సులు బోధించే అధ్యాపకుల కొరత ఏర్పడింది. ఆయా కోర్సుల్లో విద్యార్థుల నైపుణ్యాలు మెరుగుపడేలా బోధించే అధ్యాపకులకు ప్రత్యేక శిక్షణ అనివార్యమైంది. ఈ అంతరాన్ని పూడ్చడానికి రెండో ఏడాది నుంచే సంబంధిత రంగాల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించేందుకు ప్రాజెక్ట్‌ల రూపకల్పన తప్పనిసరి చేస్తూ నిబంధన విధించారు. దీంతో ఏటా మార్కెట్‌లోకి వస్తున్న విద్యార్థుల్లో కేవలం 8 శాతం మంది మాత్రమే నైపుణ్యతతో ఉంటున్నారని పారిశ్రామిక వర్గాలు పేర్కొంటున్నాయి. మొత్తం ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఆరు నెలలకోసారి విద్యార్థి మానసిక ధోరణిని పరిశీలించాలని ఏఐసీటీఈ సూచించింది.

విద్యార్థుల శ్రేయస్సుపై ప్రత్యేక దృష్టి



ఇంజినీరింగ్ విద్యా ప్రణాళికపై అవగాహన పెంపొందించేందుకు కౌన్సెలింగ్ చేపట్టనున్నాం. విద్యార్థి శ్రేయస్సుపై ప్రత్యేక దృష్టి సారించాం. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యా ప్రణాళికలో వచ్చిన మార్పులపై తరగతుల ప్రారంభంలోనే సంసిద్ధులను చేస్తున్నాం.

– డాక్టర్ జీవీఆర్ శ్రీనివాసరావు, వీసీ, జేఎన్‌టీయూఏ

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలోకి బీజేపీ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్



మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన వెంకట్రామిరెడ్డి (చిత్రంలో) వజ్ర భాస్కరరెడ్డి

తనకల్లు/కదిరి అర్బన్: జిల్లా బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్, న్యాయవాది వెంకట్రామిరెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో గురువారం పుంగనూరు నియోజకవర్గం సదుంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆయన నివాసంలో కలసి తాను వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయనకు కండువా కప్పి పార్టీలోకి మంత్రి సాదరంగా ఆహ్వానించారు. కాగా, వెంకట్రామిరెడ్డి గతంలో బీజేపీ తనకల్లు మండల కన్వీనర్‌గా, జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ... టీడీపీతో బీజేపీ పొత్తు అనైతికమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి నచ్చి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. కదిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహమ్మద్ విజయానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ప్రాసెసింగ్ యూనిట్ పరిశీలన



వేరుశనగ విత్తన నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

కదిరి అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని వేరుశనగ విత్తన ప్రాసెసింగ్ యూనిట్‌ను జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, గుంటూరు కమిషనరేట్ కార్యాలయ ఏడీఏ శ్రీనివాసాచారి గురువారం తనిఖీ చేశారు. ప్రాసెసింగ్ యూనిట్‌ల లైసెన్స్, రికార్డులు, విత్తన నాణ్యత, యంత్రాల పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ సత్యనారాయణ, ఏఓలు శ్రీనివాసరెడ్డి, శివరామకృష్ణ పాల్గొన్నారు.

తక్కువ ధర అంటూ నకిలీ బంగారం

- మోసపోయిన హైదరాబాదీలు
- రూ. 10 లక్షలతో ఉడాయించిన దుండగులు
- వారం రోజులు ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



నకిలీ బంగారు పూసల దండను చూపుతున్న బాధితుడు

పెద్దవడుగూరు: తక్కువ ధరకే రెండు కిలోల బంగారం ఇస్తామంటూ నకిలీ బంగారం అంటగట్టి రూ.10 లక్షలు అపహరించుకెళ్లిన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడు తెలిపిన మేరకు... హైదరాబాద్‌కు చెందిన శివకృష్ణ, అతని తండ్రి నరసింహులు వారి ఇంటి పక్కన ఉన్న అనిల్‌తో సన్నిహితంగా ఉండే వారు. కొన్ని రోజుల క్రితం నరసింహను అనిల్ కలసి... తన స్నేహితుడు కొత్త ఇంటిని కట్టుకునే క్రమంలో పాత ఇంటిని తొలగించి పునాదులు తీస్తుండగా రెండు కిలోల బంగారం బయటపడిందని, డబ్బు అవసరం ఉండడంతో రూ.10 లక్షలకే కిలో బంగారం విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నాడని తెలిపాడు. అనిల్ మాటలతో ఆశపడిన నరసింహా రూ. 10 లక్షలకే రెండు కిలోల బంగారాన్ని కొనుగోలు చేసేలా బేరం కుదుర్చుకున్నాడు. వారం రోజుల క్రితం డబ్బు సమకూర్చుకుని అనిల్‌ను సంప్రదించడంతో గుత్తి సమీపంలోని టోల్‌ప్లాజా వద్దకు రావాలని తెలిపాడు. దీంతో ఈ నెల 13న గుత్తికి చేరుకున్న తండ్రీకొడుకులు ఓ లాడ్జిలో అద్దెకు దిగారు. 14వ తేదీ ఉదయం టోల్‌ప్లాజా వద్దకు చేరుకోగానే అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న అనిల్ వారిని కలిశాడు. అనంతరం పామిడి మండలం రామరాజుపల్లి వద్ద ముళ్ల పొదల్లోకి పిలుచుకెళ్లి రూ.10 లక్షలు తీసుకుని బంగారం పూసల గుత్తి చేతికి ఇచ్చి పోలీసుల నిఘా ఉందని, వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ హడావుడి చేశాడు. దీంతో అదే రోజు రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరిన నరసింహా, ఆయన కుమారుడు శివకృష్ణ... శుక్రవారం ఉదయం తమకు తెలిసిన బంగారం వర్తకుడి వద్దకెళ్లి పూసలు చూపించారు. పరీక్షించిన ఆయన అవి నకిలీవని చెప్పడంతో కంగుతిన్న వారు వెంటనే తెలంగాణ పోలీసులను ఆశ్రయించారు. అయితే మోస పోయింది ఎక్కడో అక్కడికే వెళ్లి ఫిర్యాదు చేయాలని తెలంగాణ పోలీసులు తెలపడంతో గురువారం ఉదయం పెద్దవడుగూరు పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. అయితే నేరం నగదు మార్చుకున్నది పామిడి పోలీసు స్టేషన్ పరిధిలో కావడంతో అక్కడికెళ్లి ఫిర్యాదు చేయాలని సూచించడంతో బాధితులు పామిడికి వెళ్లారు.

వీఏహెచ్‌ఏలకు 45 రోజుల శిక్షణ

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా పరిధిలో ఇటీవల కొత్తగా నియమితులైన 457 మంది విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ల (వీఏహెచ్‌ఏ)కు ఏప్రిల్ 1 నుంచి 45 రోజుల శిక్షణ కార్యక్రమం ఉంటుంది. ఈ మేరకు పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ... ఉరవకొండ డివిజన్‌లో 150 మంది, అనంతపురం డివిజన్‌లో 135 మంది, పెనుకొండ డివిజన్‌లో 67 మంది, ధర్మవరం డివిజన్‌లో 65 మంది, కదిరి డివిజన్‌లో 40 మంది వీఏహెచ్‌ఏలు విధుల్లో చేరినట్లు తెలిపారు. వీరందరినీ ఆరు బృందాలుగా విభజించి బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి ప్రాంతీయ పశు శిక్షణా కేంద్రంలో రెండు బృందాలకు, సిద్ధరాంపురం పశు క్షేత్రంలో ఓ బృందానికి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అలాగే అనంతపురంలోని జేడీఏ కార్యాలయంలో రెండు బృందాలకు, సాయినగర్‌లోని పశువైద్యశాలలో ఓ బృందానికి శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఇందుకోసం ఒక్కో సెంటర్‌కు ముగ్గురు రిసోర్సు పర్సన్లను నియమించినట్లు తెలిపారు. పశుసంవర్ధకశాఖ అమలు చేస్తున్న అన్ని రకాల పథకాలతో పాటు సమగ్ర పాడి, పశుపోషణ, పశువైద్యసేవలు, ఆర్‌బీకే విశిష్టతపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తారన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సైన్స్ విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా అధునాతన సాంకేతికత విద్యను బోధించడానికి కళాశాల నిధులతో ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. కంప్యూటర్ సైన్స్ విభాగానికి అదనంగా అందజేసిన కంప్యూటర్లు విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటాయని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులు కళాశాల సౌకర్యాలను ఉపయోగించుకుని మెరుగైన ఉపాధిని పొందాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఏసీ కో-ఆర్డినేటర్ కిరణ్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి శివశంకర్, ఏఓ రమణ, అధ్యాపకులు విజయ నాయక్ పాల్గొన్నారు.



ఆర్ట్స్ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి

దాడిలో తల్లీకొడుకుకు గాయాలు

గుంతకల్లు రూరల్: గడ్డి వామి పొట్టును దొంగలిస్తూ పట్టుబడిన ఇద్దరు యువకులు కక్ష పెంచుకుని తల్లీ కొడుకుపై దాడి చేశారు. బాధితులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం నాగసముద్రం గ్రామానికి చెందిన రమేష్, తిప్పక్క దంపతులు తమ దొడ్డిలో ఆవుల పెంపకాన్ని చేపట్టారు. రమేష్ తమ్ముడు రామకృష్ణ భాగానికి వచ్చిన వామి దొడ్డిని అదే గ్రామానికి చెందిన పద్మావతి కౌలుకు తీసుకుని తన కుమారులతో కలసి పాడి పోషణ చేపట్టింది. ఈ క్రమంలో రమేష్ కొడుకులు హరీష్, రవి రోజూ పద్మావతికి చెందిన వామి నుంచి పొట్టు దొంగలించి తమ ఆవులకు వేసుకునేవారు. ఈ విషయాన్ని గుర్తించిన పద్మావతి కొడుకులు బుధవారం సాయంత్రం కాపు కాసి రవి, హరీష్ పొట్టును దొంగలిస్తుండగా చుట్టుపక్కల ఉన్న రైతులకు, గ్రామస్తులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టించారు. గ్రామస్తులు మందలించడంతో రవి, హరీష్ కక్ష పెంచుకుని గురువారం ఉదయం వామి వద్దకెళ్లిన పద్మావతి, ఆమె చిన్నకుమారుడు నరసింహులుపై దాడి చేశారు. అదే సమయంలో పొలం నుంచి అక్కడికి చేరుకున్న పద్మావతి పెద్దకుమారుడు శ్రీనివాసులు కంట్లో కారం కొట్టి దాడి చేశారు. స్థానికులు గమనించి అక్కడకు చేరుకుంటుండగా రవి, హరీష్ అక్కడి నుంచి పారిపోయారు. గాయపడిన పద్మావతి, శ్రీనివాసులను గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు గుంతకల్లు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



దాడి జరిగిన తీరు వివరిస్తున్న పద్మావతి

అంకె లక్ష్మన్నపై సస్పెన్షన్ ఎత్తివేత

సాక్షి, పుట్టపర్తి: రాప్తాడు నియోజకవర్గం కనగానపల్లి మండల జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అంకె లక్ష్మన్నపై సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కనగానపల్లికి చెందిన అంకె లక్ష్మన్న 2006లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో జెడ్పీటీసీ సభ్యుడిగా గెలిచారని గుర్తు చేశారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి చురుగ్గా పని చేశారన్నారు. అయితే 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ క్రమశిక్షణ నిబంధనలను ఉల్లంఘించడంతో అప్పట్లో ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారన్నారు.

బాలికను ఢీకొన్న ప్రైవేట్ అంబులెన్స్

ఉరవకొండ: కర్ణాటకకు చెందిన ఓ ప్రైవేట్ అంబులెన్స్ ఢీకొని బాలిక గాయపడింది. ఉరవకొండ మండలం చిన్నముష్టూరుకు చెందిన ప్రమీల తన తల్లిదండ్రులతో కలసి రాకెట్లకు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న సమయంలో ఉరవకొండ నుంచి వేగంగా వెళుతున్న అంబులెన్స్ ఢీకొంది. అనంతరం పరిస్థితి విషమంగా ఉన్న ప్రమీలను అదే అంబులెన్స్‌లో మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు చిన్నముష్టూరుకు చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

శేష వాహనంపై చెన్నకేశవుడు

యాడికి: మండల కేంద్రంలోని శివలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం గోవింద నామస్మరణతో మార్మోగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నాలుగో రోజు శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవుడిని శేష వాహనంపై భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణ మధ్య వీధుల్లో ఊరేగింపు వైభవంగా సాగింది. కార్యక్రమంలో అర్చకుడు హరికృష్ణ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉప సర్పంచు కాసా చంద్ర మోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్ వార్డు మెంబర్లు తిరుపతి, రామచంద్ర తదితరు లు పాల్గొన్నారు.



మహిళ మెడలో గొలుసు అపహరణ

గుంతకల్లు రూరల్: స్థానిక భీమిరెడ్డి కాలనీకి చెందిన సుజాత అనే మహిళ గురువారం ఉదయం గుడికి వెళ్తుండగా గుర్తు తెలియని దుండగులు ద్విచక్రవాహనంలో వచ్చి ఆమె మెడలో 1.5 తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. బాధితురాలు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

• 'పల్లె' పాట్లు



టీడీపీకి చెందిన హనుమంతుకు కండువావేస్తున్న దృశ్యం



కొత్తచెరువు: తిమ్మిని బమ్మిని చేయడం తెలుసు గానీ.... అయితే రకరకాలుగా తిమ్మిని దమ్మిని చేయడం, ఆ దమ్మిని తిమ్మిని చేయడం మనం ఎన్నడూ వినలేదు. అయితే ఇది కూడా సాధ్యమేనని నిరూపించారు టీడీపీకి చెందిన మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి. గిమ్మిక్కు రాజకీయాలకు పెట్టింది పేరుగా ఖ్యాతిగాంచిన పల్లె... వరుస వైఫల్యాలతో ఈ సారి పుట్టపర్తి టికెట్‌ను చేజార్చుకున్నారు. అయినా తిమ్మిని దమ్మిని చేసి తన కోడలికి టికెట్ వచ్చేలా చేసుకున్నారు. ఇప్పుడు దమ్మిని తిమ్మిని చేసేందుకు నానా పడబాట్లు పడుతున్నారు. ఇందుకు కొత్తచెరువులోని బీసీ కాలనీ వేదికైంది. గురువారం తన కోడలు పల్లె సింధూరరెడ్డి తరపున కుమారుడు కిషోర్‌రెడ్డితో కలసి ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. అయితే ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో స్థానిక నేతలను ఆదేశించి సంచార జాతులకు చెందిన 30 మంది మహిళలను రప్పించుకున్నారు. వీరితో పాటు పార్టీకి చెందిన కొందరికి ఒక్కొక్కరికి రూ.500 చొప్పున ఇచ్చి పార్టీ కండువాలు కప్పి టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. మొత్తానికి లేటు వయసులో లేటెస్ట్ రాజకీయం నడిపిన పల్లెను చూసి స్థానిక టీడీపీ నాయకులే ముక్కున వేలేసుకున్నారు. మొత్తానికి యాడున్నా... పల్లెకు పడబాట్లు తప్పడం లేదని జనం నవ్వుకున్నారు.

నూతన ఓటర్లకు ఎపిక్ కార్డులు



నూతన ఎపిక్ కార్డులను స్కాన్ చేస్తున్న బీఎల్‌ఓలు

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు నూతన ఎపిక్ కార్డులు మంజూరయ్యాయి. సాధారణంగా ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏదో ఒక ఆధారం అవసరమవుతుంది. ఇందులో భాగంగా ఓటు హక్కు వినియోగించుకునే నూతన ఓటర్లకు, అడ్రస్ మార్పులు చేసుకున్న వారికి, నియోజకవర్గాలు మారిన ఓటర్లకు, ఫొటోలు మారినా, ఫొటోలు సరిగాలేని వారికి నూతన ఓటరు కార్డులను అందజేస్తున్నారు. గతంలో జిల్లాకు 1.40 లక్షల ఎపిక్ కార్డులు రాగా వాటిని సంబంధిత బీఎల్‌ఓలు వాటిని స్కాన్ చేసి జిల్లా కేంద్రంలోని పోస్టాఫీసుకు పంపి అక్కడి నుంచి ఓటర్లకు చేరవేస్తున్నారు. ప్రస్తుతం 1.14 లక్షల ఓటరు కార్డులు వచ్చాయి. వాటిని స్థానిక స్పందన సమావేశ మందిరంలో బీఎల్‌ఓలు స్కాన్ చేసి పంపుతున్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని ఎన్నికల అధికారి మైనుద్దీన్ పేర్కొన్నారు.

చిన్నారులకు 2డీ ఎకో, థైరాయిడ్ పరీక్షలు

అనంతపురం మెడికల్: ప్రపంచ పుట్టుకతో వచ్చు లోపాల మాసోత్సవంలో భాగంగా గురువారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డీఈఐసీ సెంటర్‌కు వచ్చిన చిన్నారులకు 2డీ ఎకో, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణ స్వామి పేర్కొన్నారు. గురువారం డీఈఐసీలో చిన్నారులకు స్క్రీనింగ్ నిర్వహించారు. అవసరమైన చిన్నారులకు పరీక్షలు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ శ్రీవిద్య, మెడికల్ ఆఫీసర్ మల్లీశ్వరి, దంత వైద్యురాలు ముత్యాలమ్మ, స్పీచ్ థెరపిస్టు చంద్రకళ, సైకాలజిస్టు సుందర్రాజు, మేనేజర్ రజిత పాల్గొన్నారు.

బొలెరో ఢీ - వ్యక్తి మృతి



గోపాల్ (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహన చోదకుడు మృతి చెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... కంబదూరు మండలం ఎగువపల్లికి చెందిన గోపాల్ (44) బతుకు తెరువు కోసం కళ్యాణదుర్గానికి వలస వచ్చి కుటుంబంతో కలసి పార్వతీనగర్‌లో నివాసముంటున్నారు. టైలరింగ్ పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం ఉదయం తన ఇద్దరు కుమారులోత కలసి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా పవర్ ఆఫీస్ సమీపంలోకి చేరుకోగానే అనంతపురం వైపు నుంచి వేగంగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో గోపాల్‌తో పాటు ఆయన కుమారులు తరుణ్, తేజేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. చికిత్సకు స్పందించక గోపాల్ మృతి చెందాడు. తరుణ్‌కు కుడి కాలు విరిగింది. తేజేశ్వరరావుకు ఎడమ కాలు విరిగింది. వీరిద్దరూ సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. కాగా, గోపాల్‌కు లక్ష్మి, శిల్ప అనే ఇద్దరు భార్యలున్నారు. ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవర్ నియంత్రణ కోల్పోవడతో బొలెరో సైతం రోడ్డుపై అడ్డంగా బోల్తాపడింది. విషయం తెలుసుకున్న వెంటనే సీఐ హరినాథ్ స్పందించారు. ప్రమాదానికి కారణమైన బొలెరో డ్రైవర్ నరేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.